క్లుప్తంగా

గవర్నర్‌కు ఆహ్వానం



మహబూబాబాద్ అర్బన్ : వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే బంజారాల ధార్మి వ్యాప్తి మహా సమ్మేళనానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించినట్లు మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గవర్నర్ నివాసంలో మాజీ ఎంపీ, గిరిజన ఉద్యోగ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి బంజారాల ధార్మి మహా సమేళనానికి రావాలని ఆహ్వానించారు.డీటీ నాయక్, అమర్‌సింగ్ తిలావత్, ఉద్యోగ సంఘాల నాయకులు రామ్‌చందర్ నాయక్, రాజు నాయక్ పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత



నర్సింహులపేట : మండలంలోని పెద్ద నాగారం స్టేజీ సమీపంలో వరంగల్–ఖమ్మం ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను గురువారం స్థానికులు పూడ్చారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాల నియంత్రణకు స్థానికులు సొంత ఖర్చుల తో గుంతలను పూడ్చి మరమ్మతులు చేశారు.

మండల కమిటీ ఎన్నిక

గార్ల : టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మాచర్ల సుందర్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఐ.షరీఫ్, ఉపాధ్యక్షుడిగా కె.దేవేందర్, కోశాధికారిగా అబ్దుల్ ఖదీర్, కార్యదర్శులుగా జె.సుశీల, జి.పూల్‌సింగ్, స్వర్ణలత, రాజేశ్వరి, అశ్వినివర్మను ఎన్నుకున్నారు. అనంతరం గోపాలపురం హైస్కూల్లో ఇటీవల పదవీ విరమణ పొందిన పద్మను ఘనంగా సన్మానించారు.

బాలసదన్‌కు బాల కార్మికులు

తొర్రూరు : మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు బాల కార్మికులు తొర్రూరులోని ఓ దుప్పట్ల దుకాణంలో పనిచేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు చైల్డ్ లైన్ ప్రతినిధులు పట్టణానికి వచ్చి దుకాణంలో పనిచేస్తున్న బాలలను గుర్తించారు. దుకాణ యజమానికి కౌన్సిలింగ్ ఇచ్చి బాలలను జిల్లాలోని బాల సదన్‌కు గురువారం తరలించారు. చైల్డ్ లైన్ సూపర్ వైజర్ సరోజ, ప్రతినిధి అనిల్‌కుమార్, కానిస్టేబుల్ పరమేష్‌లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



మరిపెడ రూరల్ : బుర్హాన్‌పురంలో గురువారం జన వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో మరిపెడ మెడికల్ ఆఫీసర్ గుగులోత్ రవి రోగులకు పరీక్షలు చేశారు. సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉపేంద్ర, సుమలత, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్త, ఉపేంద్ర పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి



సతీష్ (ఫైల్)

డోర్నకల్ : డోర్నకల్‌కు చెందిన ఆర్మీ జవాన్ గుండెపోటుతో కలకత్తాలో తుదిశ్వాస విడిచాడు. స్థానిక యాదవనగర్‌కు చెందిన కొదిరిపాక సతీష్ (34 పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తా ఆర్మీ బేస్ క్యాంప్‌లో విధులు నిర్వహిస్తూ బుధవారం రాత్రి గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆర్మీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే సతీష్ మృతి చెందాడు. సతీష్‌కు నాలుగేళ్ల క్రితం వివాహం అయింది. శుక్రవారం సతీష్ మృతదేహం డోర్నకల్‌కు చేరుకునే అవకాశాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

'రమేశ్‌ను విడుదల చేయాలి'

బయ్యారం/గార్ల : భద్రాద్రి జిల్లా పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్న పార్టీ జిల్లా కార్యదర్శి, అజ్ఞాత దళ కమాండర్ పూనెం రమేశ్‌ను వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య, నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, యాకన్నలు, న్యూడెమోక్రసీ గార్ల మండల కార్యదర్శి జి.సక్రు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి సీహెచ్ గణేశ్ డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇల్లెందు మండలంలోని ఎల్లాపురం ఇంటి వద్ద అక్రమంగా అదుపులోకి తీసుకున్న రమేశ్‌ను విడుదల చేయాలన్నారు.

సైబర్ క్రైం కేసు నమోదు

నర్సింహులపేట : మండల కేంద్రానికి చెందిన మంచినీళ్ల సాయివర్ధన్ ఫిర్యాదు మేరకు గురువారం సైబర్ క్రైంలో కేసు నమోదు అయినట్లు ఎస్సై మాలోత్ సురేష్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు సాయివర్ధన్‌కు ఫోన్ చేసి నీపై సైబర్ క్రైమ్‌లో కేసు నమోదయిందని, రూ.48,760 పంపితే కేసు ఉండదని చెప్పగా, అతడికి యూపీఐ లింక్ ద్వారా డబ్బులు పంపడం జరిగిందన్నారు. సాయివర్ధన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుంతలమయంగా రహదారి

- అధ్వానపు రోడ్డుతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



కంకరతేలి, గుంతలమయంగా ఉన్న రోడ్డు

మహబూబాబాద్ రూరల్ : ఎప్పుడో నిర్మించిన రోడ్డు అధ్వానంగా మారడంతో మారుమూల పల్లెకు వెళ్లేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మహబూబాబాద్ మండలంలోని అయోధ్య, ముదుపుగల్ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయంగా మారి కంకరతేలి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా తమ రోడ్డు సమస్య మాత్రం తీరడం లేదని ప్రయాణికులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై కంకర తేలడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదని వాపోయారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నూతన బీటీ రోడ్డు మంజూరు చేయాలని అయోధ్య, ముదుపుగల్ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ మధు



మహబూబాబాద్ అర్బన్ : నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని మదర్‌థెరిసా సెంటర్‌లో గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ ఎక్కువగా అవుతున్నయన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, మహేష్, వినయ్, యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో..

కురవి : నాణ్యమైన భోజనం అందించాలని, మెస్ చార్జీలు పెంచాలని, విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. నాయకులు జి.జ్యోతిబసు, కొలిపాక వీరేందర్, శ్రీకాంత్, అనిల్, రమేష్, మురళీ, ఐశ్వర్య, మమత, శ్రేయ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అమలులో నిర్లక్ష్యం

తొర్రూరు : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. ఈ మేరకు డివిజన్ కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంజంపల్లి వీరన్న, నాయకులు యాకయ్య, పుల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన

- షీ టీం ఎస్సై సునంద, కురవి ఎస్సై సతీష్



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై సునంద

కురవి : నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, తగిన జాగ్రత్తతో నేరాలను అదుపు చేయొచ్చని మహబూబాబాద్ షీటీం ఎస్సై సునంద, కురవి ఎస్సై గండ్రాతి సతీష్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నాగార్జున విద్యాలయంలో అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో షీటీం, భరోసా కేంద్రం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సైబర్ నేరాలు, మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అమ్మాయిలు ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రాంలాంటి సోషల్ మీడియాలలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్–100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఉమెన్ పీసీ సుప్రజా, భరోసా లాయర్ సాహిత్య, కరస్పాండెంట్ రవి, షీటీం సిబ్బంది అరుణ, రమేష్, భరోసా సిబ్బంది బేబీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థినులకు..

కేసముద్రం : ఇనుగుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సైబర్ క్రైం, మూఢ నమ్మకాలపై పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ సర్వయ్య మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్సై మురళీధర్ రాజు, ప్రిన్సిపాల్ జయశ్రీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష సరికాదు

గార్ల : ఆడపిల్లలపై తల్లిదండ్రులు లింగ వివక్ష చూపడం సరికాదని, అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను చూడాలని జిల్లా మహిళా సాధికారిత జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. గురువారం గార్లలోని బాలికోన్నత పాఠశాలలో బేటీ బచావో, బేటీ పడావో పై ఆమె బాలికలకు అవగాహన కల్పించారు. నేటి సమాజంలో అమ్మాయిలకు రక్షణ కరువైందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, స్టాఫ్ సౌజన్య, సంధ్యారాణితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

కురవి : మండలంలోని మోద్గులగూడెం జెడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సత్యనారాయణ చారి, పీడీ దార్ల సునీల్ తెలిపారు. వీరస్ నాయక్, మన్వితలను గురువారం అభినందించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు సాయిరాం

కేసముద్రం : కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన విద్యార్థి బాదావత్ సాయిరాం రాష్ట్రస్థాయి అండర్ –14 విభాగం హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాజు, పీడీ కొమ్ము రాజేందర్ తెలిపారు.ఈ మేరకు గురువారం సాయిరాంను ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్యసిబ్బందిని నియమించాలి

బయ్యారం : పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యసిబ్బందిని నియమించాలని గురువారం పీవైఎల్ జిల్లా కార్యదర్శి కందాల రంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'ఆదివాసీలను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం'

గంగారం : ఆదివాసీలను కాంగ్రెస్ ప్రభుత్వమని నిర్లక్ష్యం చేస్తోందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ ఆగబోయిన రవి అన్నారు.

తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి



మహబూబాబాద్ అర్బన్ : డిసెంబర్ 3న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో మలిదశ తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ యూత్ డే సదస్సు నిర్వహిస్తున్నట్లు విద్యార్థి జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇరుగు మనోజ్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని నలంద జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థి జనసమితి నాయకులు తెలంగాణ యూత్ డే వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. రాజేష్, రాము, నవీన్, యశ్వంతి, షబాన, సీత, వర్షిణి, ప్రియ, బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

మరిపెడ రూరల్ : పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు అన్నారు. మండలంలోని బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన మలికంటి ఎల్లమ్మకు సీఎంఆర్ ఎఫ్ నుంచి రూ.28 వేలు చెక్కు మంజూరు కాగా, ఆమె భర్త సత్యనారాయణకు గురువారం ఐలమల్లు చెక్కు అందజేశాడు.

ప్రజాపాలనతో అనేక ఇబ్బందులు

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చంద్రన్న

నెహ్రూసెంటర్ : కాంగ్రెస్ ప్రజా పాలనలో రాష్ట్రంలోని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిన్న చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు మొట్టికాయలు వేసిన ప్రభుత్వ తీరు మారకపోవడం సరికాదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, నాయకులు ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, బండపల్లి వెంకటేశ్వర్లు, పైండ్ల యాకయ్య, పల్లెల పాపారావు, బూర్గుల మోష తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, ఉపేంద్రం



డోర్నకల్‌లో..



సీరోలు మండలం కొత్తూరు(సీ)లో..



సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా పూలే చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక ఉద్యమ నాయకుడు, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని పలువురు కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, వివిధ కుల సంఘాల బాధ్యులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్: జ్యోతిరావు పూలే వర్ధంతిలో నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ మాలోత్ కవిత



గార్ల: ఆశ్రమ పాఠశాలలో..



నర్సింహులపేటలో.. కేవీపీఎస్ నాయకులు



గూడూరులో..



మహబూబాబాద్ రూరల్: జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న అంజయ్య



తొర్రూరు పట్టణంలో.. ప్రజాసంఘాల నాయకులు



నెహ్రూసెంటర్: నివాళులర్పిస్తున్న నాయకులు



కేసముద్రంలో..

కూలీలు కాదు.. రైతులే!



బస్తాలపై ముద్ర వేస్తున్న రైతు దంపతులు

బయ్యారం : పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా పెట్టాలంటే రైతులు కూలీ అవతారం ఎత్తాల్సి వస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెంటర్ నిర్వాహకులు తిరుగల తీయించి సెంటర్ కోడ్ ముద్రను వేసి గన్నీ సంచులను రైతులకు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మండలంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా పెట్టాల్సిన బస్తాలను రైతులకే ఇచ్చి తిరుగల తీయించి, ముద్రలను వేసుకోవాలని సూచిస్తుండటంతో రైతులు శ్రమపడక తప్పటం లేదు. కాగా ఈ విషయంపై డీసీఓ వెంకటేశ్వర్లును వివరణ కోరగా బస్తాలను ముద్రలు వేయించాల్సింది నిర్వాహకులేనని సీఈఓతో మాట్లాడి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

తొర్రూరు రూరల్ : ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ల్లోని విద్యార్థులకు అందజేస్తున్న భోజనంలో నాణ్యత పాటించి పౌష్టికాహారం అందించాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ నర్సింగరావు సూచించారు. గురువారం మండలంలోని వెలికట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంఈఓ బుచ్చయ్య, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం బాగుంది: తహసీల్దార్

దంతాలపల్లి : విద్యార్థుకోసం తయారు భోజనం బాగుందని, ప్రతి రోజు ఇలానే శుభ్రంగా, రుచిగా వండాలని తహసీల్దార్ రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వేణుమాధవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

తొర్రూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు విద్యావృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. ధర్మశ్రీ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు ధరావత్ విమల ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. తమ కుమారుడు జయప్రకాశ్‌నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు విమల తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని ఉల్లెపల్లి గ్రామానికి చెందిన ఉల్లెందుల లింగయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాంగ్రెస్ నాయకులు బొడ్డు వెంకన్న, నవిల సావిత్రమ్మ, గ్రామస్తుల సహకారంతో దశదిన కర్మ నిమిత్తం మృతుని భార్యకు 50 కిలోల బియ్యం, రూ.3 వేలు ఆర్థికసాయం గురువారం అందజేశారు.

ఆర్థికసాయం

గూడూరు : మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన గుండగాని నరేష్ ఓ గ్రానైట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్దే ఉంటున్నాడు. వైద్యానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబానికి గ్రానైట్ డ్రైవర్స్ యూనియన్ తరపున గురువారం రూ. 30 వేలు అందించారు.

కుర్చీల వితరణ

తొర్రూరు : పట్టణంలోని కేజీబీవీకి లయన్స్ టీచర్స్ క్లబ్ ప్రతినిధులు కుర్చీలు వితరణ చేశారు. బాలికలు విద్యతో పాటు మరిన్ని నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని క్లబ్ అధ్యక్షుడు చింతల సురేష్ తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి

చిన్నగూడూరు : వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని ఏఐఏకేఎంఎస్ సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

నెల్లికుదురు : ప్రభుత్వ భూమిని అక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు ఇరుగు అనిల్, మీసాల నరసయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ మండలంలోని బంజర గ్రామ పరిధిలోని 309/1/3/1 సర్వే నెంబర్‌లో ఎస్సీ లబ్ధిదారుల నివాసాలకు ఎకరం 11గుంటల ప్రభుత్వ భూమిని కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కైన తమ పేర్లమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వారు ఆరోపించారు. ఇప్పటికైనా అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని లేకుంటే జరిగే పరిణామాలకు అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరించారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

పెద్దవంగర : జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నేడు చేపట్టనున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ గురువారం అన్నారు.

ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలి

కురవి : యూనియన్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం సేవలను వినియోగించుకోవాలని బ్యాంక్ మేనేజర్ కుమార్ తెలిపారు. గురువారం ఆధార్ సేవలను పరిశీలించారు.

కార్పొరేట్ వైద్యాన్ని నియంత్రించాలి

గంగారం : రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీతో పేదలు అనేక అవస్థలు పడుతున్నారని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కమిటీ సభ్యులు అశోక్ అన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధక్షుడిగా పూనెం రవికుమార్, ఉపాధ్యక్షులుగా బచ్చలి రాజేష్, వాసం శేఖర్, ప్రధాన కార్యదర్శిగా జోగ సతీష్, సహాయ కార్యదర్శిగా మోడెం సందీప్, గీతపెల్లి అనిల్, కోశాధికారిగా బచ్చల శివకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా పెనక ప్రసాద్, బచ్చల అశోక్, పణ్యం సందీప్, చందు, బచ్చల సాగర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

డోర్నకల్ : ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద లబ్ధిదారులను మోసం చేస్తోందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవానాయక్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందన్నారు. కమిటీలు, సర్వేల పేరుతో ప్రజలను మోసం చేయకుండా వెంటనే అర్హులైన పేదలకు ఇందిరమ్మ మంజూరు చేయాలని దేవానాయక్ డిమాండ్ చేశారు.

నిబంధనల మేరకు కొనుగోళ్లు చేయాలి



తేమను పరిశీలిస్తున్న డీఆర్డీఓ మధుసూదన్ రాజు



కురవి: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుధాకర్

మహబూబాబాద్ రూరల్ : ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సకాలంలో కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి మధుసూదన్ రాజు అన్నారు. మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మధుసూదన్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యాన్ని శుభ్రపరిచే మిషన్, ధాన్యం గింజల పరిమాణాన్ని, తేమ శాతాన్ని పరిశీలించే పరికరం, కొనుగోలు వివరాలు నమోదు చేసే రికార్డు పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం తిలక్ పాల్గొన్నారు.

లారీలు అందుబాటులో ఉంచాలి : సీపీఎం మండల కార్యదర్శి సైదులు

నెల్లికుదురు : కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు అయినా ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలను అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బందుల రాకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సీపీఎం ఆధ్వర్యయంలో సందర్శించిన మాట్లాడారు. నాయకులు బాబు గౌడ్, యాకయ్య, వెంకటయ్య, కొమురయ్యతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కురవి/డోర్నకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. గురువారం కురవి మండలంలోని రాజోలులో కురవి సొసైటీ ఆధ్వర్యంలో, డోర్నకల్‌లో వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సెర్ప్, డీఆర్డీఏ, దాశరథి ఉమెన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని తెలిపారు. సన్న వడ్లకు ప్రభుత్వం అందించే బోనస్ రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు.